సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం ׀ 4 ׀ ఆగస్టు ׀ 2023



వాటా దక్కేవరకు పోరాటం

పద్మశాలీలకు వచ్చే ఎన్నికల్లో వాటా దక్కే వరకు పోరాటం చేస్తామని కందగట్ల స్వామి అన్నారు. - 8లో



దేశవ్యాప్త ఉద్యమం..

రవాణా రంగంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై దేశవ్యాప్త ఉద్యమం చేపట్టనున్నట్లు లక్ష్మయ్య తెలిపారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
31°/24°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

1,57,216 మందికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

భువనగిరి : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా వ్యాప్తంగా 1,72,285 మందికి గాను 1,57,216 (91.25శాతం) మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఇందుకోసం 1,878 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లికార్జున్‌రావు తెలిపారు. మాత్రలు వేసుకోనివారికి ఈ నెల 10న పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల పనితీరు పరిశీలన

ఆలేరురూరల్ : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరును పరిశీలించేందుకు అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఏసీపీ శివరాంరెడ్డి, డీపీఓ పద్మజారాణితో కూడిన బృందం గురువారం ఆలేరు మండలంలో పర్యటించింది. గ్రామ పంచాయతీ కార్యాలయాలకు వెళ్లి రికార్డుల నిర్వహణ, పారిశుద్ధ్య పనులు, హరితహారంలో నాటిన మొక్కలు, సంరక్షణ తదితర విషయాలపై నేరుగా కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. మంతపురి, కొల్లూరు, మందనపల్లి, పటేల్‌గుడెం, కందిగడ్డతండాలో అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ సునంద, ఎంపీడీఓ జ్ఞానప్రకాష్, ఎంపీఓ సలీం, కార్యదర్శులు పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



స్వామివారికి హారతినిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నిత్య పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు.. శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం చేసి తులసీదళాలతో అర్చించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఇక ప్రధానాలయ ముఖమండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తుల వద్ద అష్టోత్తర పూజలు, ముఖమండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం జోడు సేవలు, సహస్ర నామార్చన, రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ గడువు పెంపు

నల్లగొండ రూరల్: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ పొందుటకు ఈనెల 16వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు నల్లగొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని దూరవిద్య కోఆర్డినేటర్ డాక్టర్ సుంకరి రాజారాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ సమాన అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్ 7382929758, 8919436579 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బ్రిడ్జి నిర్మించాలి



వాగులో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

భువనగిరిరూరల్ : ముత్తిరెడ్డిగూడెం చెరువు మరియు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో రైతులు, గీత కార్మికులు, రైతులు అంతరోల్ల బావి దగ్గర కాల్వ దాటలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాల్వపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామ రైతులతో కలిసితో కాల్వను పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాల్వపై వంతెన నిర్మించకపోవడంతో ఏటా వర్షాకాలం ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అధికారులు తక్షణమే స్పందించి కాల్వను పరిశీలించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యుడు కొండ అశోక్, గ్రామ శాఖ కార్యదర్శి కూకట్ల కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కూకుంట్ల బొక్కా కుమారి, రైతులు జక్కుల యాదగిరి, అంతరి జయప్రద, అంతరి మల్లేశం, బోనగిరి జమ్మయ్య, బోనగిరి బాలయ్య, శెట్టి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు



నల్లగొండ టూటౌన్: అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎన్. భాస్కర్ రావు, గాదరి కిషోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, రమావత్ రవీంద్రకుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నోముల భగత్‌కుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, సైదిరెడ్డిలు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రైతులకు రూ.లక్షలోపు రుణమాఫీ చేయాలని నిర్ణయం తీసుకున్న కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదాతల హర్షం



రుణమాఫీ చేయడంతో గురువారం రాజాపేట మండలం దూదివెంకటాపురం శివారులోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్ పేరుతో వరి నారు ఏర్పాటు చేసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న రైతులు

ప్రగతికి ఊతం





బీబీనగర్ వరకు మెట్రో

- జాతీయ రహదారికి అనుసంధానంగా ఏర్పాటు
- ఆమోదించిన రాష్ట్ర కేబినెట్
- ఇప్పటికే యాదాద్రి వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగించిన కేంద్రం
- మెరుగుపడనున్న రవాణా వ్యవస్థ
- పారిశ్రామిక, రియల్ ఎస్టేట్ రంగాలకు మరింత ఊపు

సాక్షి, యాదాద్రి : జిల్లాకు ప్రజారవాణా వ్యవస్థ మరింత మెరుగుపడనుంది. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరంపై ఒత్తిడి తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలు యాదాద్రి భువనగిరి జిల్లా ప్రగతికి ఊతం ఇవ్వనున్నాయి. ఇప్పటికే ఎంఎంటీఎస్ రెండవ దశను కేంద్రం యాదాద్రి వరకు పొడిగించింది. తాజాగా మెట్రో రైల్ మూడవ దశను బీబీనగర్ వరకు విస్తరించాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది.

బహుళ ప్రయోజనాలు

మెట్రో, ఎంఎంటీఎస్ రైల్వే ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే జిల్లాకు రవాణా వ్యవస్థ మెరుగుపడనుంది. ప్రయాణికులు తక్కువ చార్జీతో వేగంగా, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా గమ్యస్థానం చేరడానికి వీలుంటుంది. అంతేకాకుండా బీబీనగర్ ఎయిమ్స్‌కు, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణికులు నేరుగా చేరుకునే అవకాశం ఉంటుంది. బీబీనగర్, భువనగిరి పారిశ్రామిక వాడలు, ఇతర రంగాలకు రవాణా సౌకర్యం పెరగనుంది. హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించవచ్చు.

ఉప్పల్ నుంచి ఘట్‌కేసర్ మీదుగా మెట్రో..

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ నుంచి ఘట్‌కేసర్ మీదుగా బీబీనగర్ వరకు 25.3 కిలో మీటర్ల మేర మెట్రో రైల్ ప్రాజెక్టును మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో ఆమోదం కూడా తెలిపింది. ఈ ప్రాజెక్టుకు రూ.6,900 కోట్లు కేటాయించినట్లు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. ప్రాజెక్టును నాలుగుళ్లలో పూర్తి చేస్తామని ప్రకటించారు. అయితే మెట్రోను బీబీనగర్ నుంచి భువనగిరి మీదుగా యాదాద్రి వరకు పొడిగించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు అవకాశం

హైదరాబాద్ మహానగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో జనాభా రద్దీని తగ్గించడానికి శాటిలైట్ టౌన్‌షిప్‌లు కూడా ఏర్పాటయ్యే అవకాశాలున్నాయి. తద్వారా కుదేలైన రియల్‌ఎస్టేట్ రంగం మూడు, నాలుగేళ్లలో పుంజుకునే అవకాశం ఉంటుంది. నగరంలో ఉండే అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనతో శాటిలైట్ టౌన్‌షిప్‌లు ఏర్పాటు కానున్నాయి. టౌన్‌షిప్‌లలో నివసించేందుకు నగర ప్రజలు పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతుండడంతో హైదరాబాద్‌లో అద్దె ఇళ్లలో జీవించే సగటు మనిషి జీవన వ్యయం తగ్గుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.

ప్రారంభంకానున్న ఎంఎంటీఎస్ పనులు

ఘట్‌కేసర్‌నుంచి యాదాద్రి వరకు చేపట్టనున్న ఎంఎంటీఎస్ రెండో దశ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఘట్‌కేసర్, ఎయిమ్స్, బీబీనగర్, పగిడిపల్లి, భువనగిరి, యాదాద్రి(రాయగిరి) వరకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేసి మెట్రో రైళ్లను ప్రారంభించడానికి దక్షిణ మధ్య రైల్వే చర్యలు చేపట్టింది. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ఈనెల 6వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా యాదాద్రి రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశధారు.రూ.24.50 కోట్లతో స్టేషన్‌ను సుందరీకరించనున్నారు. మరో వైపు రూ.410 కోట్లతో ఎంఎంటీఎస్ పనులు చేపట్టనున్నారు. కాగా ఎంఎంటీఎస్‌ను యాదాద్రి నుంచి ఆలేరు వరకు పొడిగించాలని స్థానికులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



మెట్రో రైల్‌ను బీబీనగర్ వరకు పొడిగిస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు. జిల్లా నుంచి నిత్యం వేలాదిమంది హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. మెట్రో రైల్‌ను బీబీనగర్ వరకు పొడిగించడం వల్ల రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుంది. రహదారుల మీదుగా ప్రయాణభారం తగ్గుతుంది. మెట్రోను భవిష్యత్‌లో భువనగిరి వరకు పొడిగించాలని ముఖ్యమంత్రిని కలిసి విన్నవిస్తా.

–పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే , భువనగిరి

శాటిలైట్ టౌన్ షిప్‌లు ఏర్పడుతాయి



కేంద్రం మంజూరు చేసిన ఎంఎంటీఎస్ వల్ల రవాణ వ్యవస్థ మరింత మెరుగుపడుతుంది. హైదరాబాద్ జంటనగరాల్లో చాలీచాలని వేతనాలతో అద్దె ఇళ్లలో జీవిస్తున్న పేద, మధ్య తరగతి వర్గాలు స్వగ్రామాలకు వచ్చిపోవడానికి మార్గం సుగమం అవుతుంది. అంతేకాకుండా రియల్‌ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందడంతో పాటు శాటిలైట్ టౌన్ షిప్‌లు ఏర్పడుతాయి. హైదరాబాద్ మహానగరం , చుట్టుపక్కల నుంచి ఎయిమ్స్‌కు వచ్చేవారికి ఎంఎంటీఎస్ ఎంతో ఉపయోగపడుతుంది.

–బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎంపీ భువనగిరి

బీఆర్‌ఎస్‌లో అసంతృప్తి జ్వాల

సిట్టింగ్ ఎమ్మెల్యేలపై బయటపడుతున్న అసమ్మతి

- కొన్నిచోట్ల లోలోపల.. మరికొన్నిచోట్ల బాహాటంగానే
- దేవరకొండ ఘటనతో చర్చనీయాంశంగా ఎమ్మెల్యేల తీరు
- ప్రత్యేక ఎజెండాతో ప్రజల్లోకి వెళ్తున్న ఆశావహులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: బీఆర్‌ఎస్ పార్టీలో అసంతృప్తి క్రమంగా బయటపడుతోంది. పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలపై సొంత పార్టీ నేతల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కొన్ని చోట్ల లోలోపల అసంతృప్తి గూడుకట్టుకుని ఉండగా.. మరికొన్ని చోట్ల అసంతృప్తులు బహిరంగంగానే సమావేశాలు నిర్వహించి సిట్టింగ్ ఎమ్మెల్యేలపై తిరుగుబావుటా ఎగురవేస్తున్నారు. దీనికి తోడు ఆశావహులు ఎమ్మెల్యేలపై వ్యతిరేకతను ప్రచారం చేయడంతోపాటు సొంత కార్యక్రమాలతో ముందుకెళ్తున్నారు. ఇప్పటి వరకు తెర వెనుక ఉన్న అసమ్మతి గళం ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ బయటకు వస్తోంది.

ఒక్కొక్కటిగా బయటకు..

దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌కు వ్యతిరేకంగా సొంత పార్టీ నేతలు ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆయనకు టికెట్ ఇవ్వొద్దంటూ తీర్మానం చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. డిండిలో నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులంతా బుధవారం సమావేశమయ్యారు. మండల నాయకులతోపాటు దేవరకొండ మున్సిపల్ చైర్మన్, మాజీ చైర్మన్ వంటి ముఖ్య నేతలు ఈ సమావేశంలో పాల్గొనడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. గతంలో కోదాడ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్‌కు వ్యతిరేకంగా అసమ్మతి నేతలు, మాజీ ఎమ్మెల్యే చందర్ రావు, నియోజకవర్గ మాజీ ఇంచార్జి కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి తదితరులు సమావేశమై అసంతృప్తి ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు సహకరించబోమని, తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా ఐక్యంగా పనిచేస్తామని తీర్మానం చేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన ప్రగతి నివేదన సభలో మంత్రి కేటీఆర్.. ప్రస్తుత ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌ను 40వేల మెజారిటీతో మరోసారి గెలిపించాలని కోరడంతో తనకు ఇక అభ్యర్థిగా అవకాశం ఇవ్వరని గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేలు రాజీనామా చేశారు.

లోలోపల అసంతృప్తి సెగలు..

మునుగోడు నియోజకవర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని ఉప ఎన్నికలకు ముందు వ్యతిరేకించిన వారు ఇప్పుడు బహిరంగంగా వ్యతిరేకించకపోయినప్పటికీ లోలోపల రగిలిపోతున్నారు. చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు ప్రస్తుతం ఎమ్మెల్యే పాల్గొనే కార్యక్రమాలకు హాజరు కావడం లేదు. ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజుతో పాటు ఆశావహులు బొల్ల శివశంకర్, కర్నాటి విద్యాసాగర్, నారబోయిన రవి తమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. నాగర్జునసాగర్‌లోనూ ఎమ్మెల్యే నోముల భగత్‌కు ఎమ్మెల్సీ కోటిరెడ్డి వర్గానికి సఖ్యత లేదు. ఇద్దరు ఒకే వేదికపై ఉన్నా పలకరించుకునే పరిస్థితి లేదు. ఈ నియోజకవర్గంలో ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో టికెట్ సంపాదించాలనే లక్ష్యంతో బుసిరెడ్డి పాండురంగారెడ్డి తన ట్రస్టు పేరుతో నియోజకవర్గంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మన్నెం రంజిత్ యాదవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి కూడా ఆదే ఆలోచనతో కార్యక్రమాలు చేస్తున్నారు. నల్లగొండలోనూ అదే పరిస్థితి నెలకొంది. సిట్టింగ్ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఉన్నా, తనకు టికెట్ ఇవ్వాలని కోరుతూ పిల్లి రామరాజు యాదవ్ సొంతంగా ఫౌండేషన్ పెట్టుకొని కార్యక్రమాలు చేస్తున్నారు. ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన మోత్కుపల్లి నర్సింహులు ఇటీవల ఆలేరులో జరిగిన కార్యక్రమంలో అధిష్టానం ఆదేశిస్తే ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో ఎక్కడి నుంచైనా పోటీ చేస్తానని ప్రకటించడం, ఎక్కడి నుంచి అనేది చెప్పకపోవడంలో చర్చనీయాంశంగా మారింది.

రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



బీజేపీలో చేరుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు

భూదాన్‌పోచంపల్లి : వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు. భూదాన్‌పోచంపల్లిలోని పెద్దమ్మగుడి చైర్మన్ చింతల రామచంద్రం ఆధ్వర్యంలో 20 మంది ముదిరాజ్ సంఘం నాయకులు హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఈటెల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ కుటుంబ పాలన నుంచి విముక్తి పొందాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. గూడూరు నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీకి ఆదరణ పెరుగుతుందని, కేంద్ర పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో వనం రాందాస్, పోనమోని ముత్యాలు ఉన్నారు. కార్యక్రమంలో సాయిలు, జనార్దన్, భాష,యాదయ్య, లింగస్వామి, నరసింహ, అశోక్, లక్ష్మణ్‌కుమార్, రాజేష్, శేఖర్, జనార్దన్, యాదయ్య పాల్గొన్నారు.

జంక్షన్ల పనులు జామ్!



హైదరాబాద్ చౌరస్తాలో నిలిచిన పనులు



నల్లగొండ చౌరస్తాలో..

- రూ.32 లక్షలతో కూడళ్ల విస్తరణ
- మూడు నెలల క్రితం పనులు ప్రారంభం
- కాంట్రాక్టర్ అలసత్వంతో జాప్యం!

భువనగిరి : పట్టణ సుందరీకరణలో భాగంగా భువనగిరి మున్సిపాలిటీలో చేపట్టిన జంక్షన్ల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. రెండున్నర నెలల క్రితం పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ మధ్యలోనే ఆపేశాడు. ప్రహరీ, గేట్లు మాత్రమే ఏర్పాటు చేశాడు.

రూ.32 లక్షలతో నిర్మాణం

జంక్షన్లను ఆకర్షణీయంగా నిర్మించేందుకు పట్టణ ప్రగతి నుంచి రూ.32 లక్షలు కేటాయించారు. నల్లగొండ చౌరస్తా విస్తరణకు రూ.15 లక్షలు, హైదరాబాద్ చౌరస్తాకు రూ.17లక్షల చొప్పున కేటాయించారు. ఆయా చౌరస్తాలను విస్తరించడంతో పాటు పచ్చిక, పూల మొక్కలు, ఆకర్షించేందుకు జంతువులు, ఇతర బొమ్మలు ఏర్పాటు చేయవలిసి ఉంది. పనులు ప్రారంభించి మూడు నెలలు కావస్తున్నా కొలిక్కిరావడం లేదు. 50రోజుల క్రితం నిలిచిపోయిన పనులు గురువారం మొదలయ్యాయి.

త్వరితగతిన పూర్తి చేస్తాం

పట్టణ సుందరీకరణలో భాగంగా నల్లగొండ, హైదరాబాద్ చౌరస్తాలను జంక్షన్లుగా మారుస్తున్నాం. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తాం.

–నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్

భువనగిరిరూరల్ : ఆల్బెండజోల్ మాత్రలు వేయించడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చని, తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలకు మాత్రలు వేయించాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. గురువారం జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని భువనగిరి మండలం రాయగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి మాట్లాడారు. నులి పురుగులనేవి పేగుల నుంచి పోషకాలను గ్రహించి అభివృద్ధి చెందే పరాన్న జీవులని, వీటి ద్వారా రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, బలహీనత, కడుపునొప్పి, బరువు తగ్గడం లాంటి ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు.నివారణకు కలుషిత ఆహారం తినవద్దని, భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ నరాల నిర్మల, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్‌రావు, డీఈఓ నారాయణరెడ్డి, కౌన్సిలర్ అరుణ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పరిపూర్ణాచారి, డాక్టర్ వినోద్, హెచ్‌ఎం అరుణ పాల్గొన్నారు.

కార్యాలయాల తనిఖీ

యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్టలోని మండల ప్రజాపరిషత్, తహసీల్దార్ కార్యాలయాలను గురువారం కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తనిఖీ చేశారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, పురోగతిపై తెలుసుకున్నారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉన్నందున గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పెండింగ్ ఫైళ్లను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కారం ప్రభాకర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్‌లో కొట్లాట!

- రామాంజనేయులు, చిక్కుల వెంకటేశం వర్గీయుల ఘర్షణ

భువనగిరిటౌన్ : కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రామాంజనేయులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిక్కుల వెంకటేశం వర్గీయులు ఘర్షణకు దిగారు. భువనగిరిలోని రహదారి బంగ్లాలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల భువనగిరి మండల ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు వర్గీయులు.. కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి వేసిన కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న వారు బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కోవర్టులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ పరిణామాలను చిక్కుల వెంకటేశం వర్గీయులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా గురువారం వారిని రహదారి బంగ్లాకు పిలిపించారు. రామాంజనేయులు, చిక్కుల వెంకటేశం వర్గాల మధ్య మాటామాట పెరగడంతో పరస్పరం చెప్పులు, కుర్చీలు విసురుకున్నారు. ఈ సమయంలో ఇతరులు లోపలికి రాకుండా రహదారి బంగ్లా తలుపులు వేయడం గమనార్హం.

మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం



పార్టీలో చేరిన వారితో బీఆర్‌ఎస్ నాయకుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

- బీఆర్‌ఎస్ నాయకుడు అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. భూదాన్‌పోచంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ పెద్దల చక్రపాణి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు గురువారం హైదరాబాద్‌లో కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి అనిల్‌కుమార్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావడానికి కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో పెద్దల సుధాకర్, పి.బాలరాజు, గుర్ర దానయ్య, కృష్ణ, ఓరుగంటి శ్రీను, పెద్దల బాలయ్య, పెద్దల మల్లేశ్, కంసాని యాదగిరి, కుక్క వినోద్, ధనుంజయ్, విష్ణు, బాబు, సదానందం, వినయ్, సాల్మాన్, చైతూ, వివేక్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు చంద్రశేఖర్, కొమ్ము శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుమారుడితో పాటు మహిళ అదృశ్యం

నకిరేకల్: మండలంలోని నెల్లిబండ గ్రామానికి చెందిన ఓ మహిళ తన రెండేళ్ల కుమారుడితో పాటు అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లిబండ గ్రామంలో నివాసముంటున్న బుడిగె యాదగిరి జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం యాదగిరి భార్య తన రెండేళ్ల చిన్నకుమారుడిని తీసుకొని ఇంటికి వెళ్లిపోయింది. సాయంత్రం యాదగిరి ఇంటికి వచ్చేసరికి పెద్ద కుమారుడు మాత్రమే ఇంటి వద్ద ఉండగా.. భార్య, చిన్నకుమారుడు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్మికుడి ఆత్మహత్యాయత్నం



చేతిలో పెట్రోల్ బాటిల్‌తో పంచాయతీ కార్మికుడు

వలిగొండ: ఒంటిపై పెట్రోల్ పోసుకొని గ్రామ పంచాయతీ కార్మికుడు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన వలిగొండ మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తమ సమస్యలు పరిష్కరించాలని గత 29 రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుండడంతో వలిగొండ మండల కేంద్రంలో చెత్త పేరుకుపోయింది. దీంతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్లరేపాక గ్రామానికి వెళ్లే దారిలోని చెత్తను జేసీబీ సహాయంతో ఎత్తి ట్రాక్టర్‌లో పోసి తీసుకెళ్తుండగా, విషయం తెలుసుకున్న పంచాయతీ కార్మికులు అక్కడకు చేరకొని అడ్డుకున్నారు. అదే సమయంలో కొండె నర్సింహా అనే కార్మికుడు జేసీబీ పైకి ఎక్కి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడు. పక్కనే ఉన్న కార్మికులు అతడి చేతిలో నుంచి పెట్రోల్ బాటిల్ లాక్కొని నిలువరించారు. అనంతరం భువనగిరి–చిట్యాల ప్రధాన రహదారిపై పంచాయతీ కార్మికులు బైఠాయించి ధర్నా నిర్వహించారు. రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచాయతీ కారికులకు నచ్చచెప్పి ధర్నాను విరమింపజేశారు.

యాదాద్రి ఆలయంలో గోవా మంత్రి పూజలు



గోవా మంత్రి విశ్వజిత్‌రాణేకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని గోవా రాష్ట్ర ఆరోగ్య, పట్టణాభివృద్ధి, పట్టణ, గ్రామ ప్రణాళికా మంత్రి విశ్వజిత్‌రాణే, ఆయన సతీమణి దేవియరాణేతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు వారికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామిని దర్శించుకున్న మంత్రి దంపతులకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

విధి వంచితులు !



భర్తకు అన్నం తినిపిస్తున్న పద్మ



గదిలో గొలుసుతో కట్టి బంధించబడిన శైలజ

- ఇంటిపెద్దకు పక్షవాతం, భార్యకు ఫైలేరియా, కూతురు మానసిక దివ్యాంగురాలు
- ఆ.. కుటుంబాన్ని వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు
- పూటగడవక దుర్భర జీవనం
- ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని వేడుకోలు

విధి వైపరీత్యమంటే ఇదేనేమో. పక్షవాతంతో కుటుంబ పెద్ద కదలలేని స్థితి. భార్యకు ఫైలేరియా.. ఇక కూతురు మానసిక దివ్యాంగురాలు. ఇలా వెంటాడుతున్న అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పూట గడవక జీవచ్ఛవాలుగా బతుకీడుస్తున్న ఓ కుటుంబ దీనగాథ ఇదీ. ఆలనాపాలన చూసే వారు లేక ఆపన్నహస్తం అందించాలని ఆ కుటుంబం దాతలను వేడుకుంటోంది.

కన్నీటి గాథ

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ గ్రామానికి చెందిన కంచర్ల నర్సింహాచారి వ్యవసాయ బావుల విద్యుత్ పంపుసెట్లు మరమ్మతులు చేసే మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. నాలుగేళ్ల క్రితం ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని ఎడమ కాలు విరిగిపోయింది. చికిత్సకు రూ.2లక్షలు ఖర్చు చేసినా నేటికీ విరిగిన కాలు కదపని పరిస్థితి. ఇది ఇలా ఉండగానే నెల రోజుల క్రితం కుడి కాలుకు పక్షవాతం వచ్చి మంచానికే పరిమితమయ్యాడు. ఆయుర్వేదం, హోమియోపతి అంటూ ఎన్నో ఆస్పత్రులు తిరిగి రూ.50వేల వరకు ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోయింది.

కూతురు పరిస్థితి దయనీయం..

ఇక నర్సింహాచారి కూతురు శైలజ(20)ది దారుణమైన పరిస్థితి. 15 ఏళ్ల వయసులో ఉండగా మూర్ఛవ్యాధి బారిన పడింది. క్రమం తప్పకుండా ఆస్పత్రికి తీసుకెళ్తూ ప్రతి నెలా రూ.3వేల విలువైన మందులు వాడటంతో వ్యాధి అదుపులో ఉంది. అయితే తండ్రి నర్సింహాచారి రోడ్డు ప్రమాదానికి గురికావటంతో ఆ కుటుంబం పూట గడవటమే గగనంగా మారింది. ఈ తరుణంలో కూతురు శైలజ మూర్ఛవ్యాధికి మందులు కొనడం భారంగా మారింది. నాలుగేళ్లుగా మందులు లేకపోవటంతో వ్యాధి ముదిరింది. ఒంటిపై కనీసం బట్టలు కూడా ఉంచుకునే సోయి లేకుండా మానసిక స్థితి కోల్పోయింది. తల్లిదండ్రులతో పాటు ఇంటికి వచ్చిన వారిపై దాడి చేస్తుండటంతో గొలుసులతో కట్టి ఓ గదిలో బంధించారు. గదిలోని మంచంపైనే భోజనం, కాలకృత్యాలు తీర్చుకునే దుస్థితి నెలకొంది. ఏదైనా ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తే వ్యాధిని కొంత వరకు తగ్గించ వచ్చునని, మానసిక స్థితిలో మార్పురావచ్చని వైద్యులు తెలిపారు. కూతురును ఆస్పత్రికి తీసుకెళ్లటానికి మనుషులు, చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి.

సాయం చేయాల్సిన వివరాలు
పేరు : కూరెళ్ల నర్సింహాచారి
ఖాతా నంబర్ : 20263157328
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నకిరేకల్
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్ 0015352

నరకయాతన అనుభవిస్తున్నా..



20 ఏళ్లు వచ్చినా మా కూతురు ఆరోగ్యం మెరుగుపడటం లేదు. నా భర్త బాగున్న రోజుల్లో రోజుకు రూ.500 తెచ్చేవాడు. ప్రస్తుతం ఆయన మంచానికే పరిమతం అయ్యాడు. ఖరీదైన వైద్యం చేయించ లేక, గదిలో కుమార్తె బాధ చూడలేక నిత్యం నరకయాతన అనుభవిస్తున్నా. నాతో పాటు, నా కూతురుకు అధికారులు పింఛన్ మంజూరు చేయాలి. మా కూతురును ఏదైనా ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించాలి. దాతలు స్పందించి ఆర్థికసాయం అందజేసి మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

– కంచర్ల పద్మ, కొర్లపహాడ్

అన్నీ తానై సపర్యలు చేస్తూ..

నర్సింహాచారి భార్య పద్మ ఫైలేరియా వ్యాధి బారిన పడింది. కూలి పనులకు వెళ్లేందుకు కూడా వీలు కావటం లేదు. ఫైలేరియా వ్యాధి ధ్రువీకరణ పత్రం ఉన్నా ఆమెకు పింఛన్ మంజూరు కాలేదు. నర్సింహాచారికి నెలనెలా వచ్చే ఆసరా పింఛన్ డబ్బులు, రేషన్ బియ్యంతోనే ఆ కుటుంబం దుర్భర జీవనం గడుపుతోంది. లేవలేని స్థితిలో ఉన్న భర్తకు, మానసిక స్థితి సరిగాలేని కూతురుకు అన్నీ తానై పద్మ సేవలు చేస్తూ నరకయాతన అనుభవిస్తోంది. ఎవరైనా దాతలు సహరించి ఆర్థికసాయం అందిస్తే భర్త, కూతురుకు వైద్యం చేయిస్తానని అర్థిస్తోంది.

బాలింత కడుపులో ఇన్‌ఫెక్షన్

- డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమంటూ ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల ధర్నా



కమలా నెహ్రూ ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న బాలింత కుటుంబ సభ్యులు, బంధువులు

నాగార్జునసాగర్: డాక్టర్ల నిర్లక్ష్యంతోనే బాలింతకు ఇన్‌ఫెక్షన్ సోకిందని ఆరోపిస్తూ ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు గురువారం నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. వివరాలు.. నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్ కాలనీకి చెందిన ఎర్రవల్లి సబిత జూలై 7వ తేదీన డెలివరీ కోసం హిల్‌కాలనీలోని కమలా నెహ్రూ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరగా డాక్టర్లు ఆపరేషన్ చేశారు. అనంతరం డిశ్చార్జి అయ్యింది. రెండు రోజుల తర్వాత ఆమెకు ఇన్‌ఫెక్షన్ వచ్చి జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు తిరిగి ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ చికిత్స అందించలేమని మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు తీసుకెళ్లమని అక్కడి డాక్టర్లు సూచన చేశారు. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్లలో గల ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్లు పరిశీలించి కడుపులో పూర్తిగా ఇన్‌ఫెక్షన్ అయ్యిందని గుంటూరుకు తీసుకెళ్లమని సూచించడంతో అక్కడకు వెళ్లారు. గుంటూరులో ఓ ఆస్పత్రిలో ఇన్‌ఫెక్షన్ తొలగేందుకు వైద్యం చేయించగా.. రూ.6లక్షలకు పైగా ఖర్చయ్యాయని కుటుంబ సభ్యులు ఆరోపించారు. అయినా ఇప్పటికీ సబిత ఆరోగ్య పరిస్థితి బాగాలేదని వాపోయారు. కమలా నెహ్రూప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఇలా జరిగిందని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సబిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. ఈ విషయమై సంబంధిత ఉన్నతాధికారులకు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా విజయపురిటౌన్ ఎస్‌ఐ సంపత్ గౌడ్ అక్కడకు చేరుకొని వారికి నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. ఈ ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ భానుప్రకాశ్ మాట్లాడుతూ.. సబిత ఆరోగ్యం పరిస్థితి బాగా ఉన్న సమయంలోనే డిశ్చార్జి చేశామని తెలిపారు. డాక్టర్ల తప్పిదమేమీ లేదని అన్నారు. విచారణలో డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నేటితో నీటి విడుదలకు 56ఏళ్లు పూర్తి

- 1967 ఆగస్టు 4న సాగర్ కాల్వలకు నీటిని విడుదల చేసిన ఇందిరాగాంధీ



నీటిని విడుదల చేసి మాట్లాడుతున్న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ (ఫైల్)

నాగార్జునసాగర్: రెండు తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రా వరప్రధాయినీ నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కాల్వలకు నీటిని విడుదల చేసి నేటికి 56ఏళ్లు నిండాయి. కృష్ణానదిపై నిర్మించిన నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ మానవనిర్మిత ఆనకట్టల్లో ప్రపంచంలోనే అతిపెద్దది. 1967 ఆగస్టు 4న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేసి, నాగార్జునసాగర్ ప్రాజెక్టును జాతికి అంకితం చేసింది. 1955 డిసెంబర్ 10న నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ శంకుస్థాపన చేయగా 12సంవత్సరాల అనంతరం ఆయన కుమార్తె ఇందిరాగాంధీ సాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. దీంతో ఆనాడు రైతుల కళ్లలో ఆనందం తొనికిసలాడింది. కాల్వల్లో నీరు పారడంతో బీళ్లుగా ఉన్న భూముల్లో రైతులు సిరులు పండిస్తున్నారు. నాడు కటిక దరిద్రాన్ని అనుభవించిన రైతులు నేడు ఆర్థికంగా బలపడ్డారు. తాగు, సాగునీటికి కొదవలేకుండా పోయింది. నాటి నుంచి నేటి వరకు అధిక సంవత్సరాలు ఆగస్టు మాసంలోనే కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది కూడా ఎగువ కురుస్తున్న వర్షాలతో ఆగస్టు మాసంలోనే ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తారని రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

రైతు పక్షపాతి ముఖ్యమంత్రి కేసీఆర్

- మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు

ఆలేరురూరల్ : రైతుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని పథకాలను అమలు చేస్తూ రైతు పక్షపాతిగా నిలిచారని, రైతుల పక్షాన నిలబడి లక్ష రుణమాఫీ చేయడం చాలా సంతోషకరమైన విషయమని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు రుణాలు తీర్చలేక అనేక ఇబ్బందులు పడుతున్న క్రమంలో రుణమాఫీ చేయడం రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పార్టీకి మనందరం వెన్నుదన్నుగా ఉంటూ కేసీఆర్ సారథ్యంలో ముందుకు సాగాలన్నారు. తెలంగాణ రైతాంగ సంక్షేమం వ్యవసాయాభివృద్ధే సర్కార్ ప్రధాన లక్ష్యమన్నారు. రైతుల సంక్షేమం కోసం కేసీఆర్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నారని అన్నారు. అనంతరం పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేషం, మండల అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మోత్కుపల్లి జ్యోతిప్రవీణ్, వైస్ చైర్మన్ పోరెడ్డి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, పీఏసీఎస్ చైర్మన్ మొగులగాని మల్లేషం, డైరెక్టర్లు కుండె సంపత్, పత్తి వెంకటేష్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

భువనగిరిరూరల్ / క్రైం : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని వడపర్తి గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వడపర్తి గ్రామానికి చెందిన పాండాల భగత్(18) తన స్నేహితుడు కుమార్ తేజతో కలిసి యాక్టివా బైక్‌పై భువనగిరి పట్టణానికి పాల ప్యాకెట్ కొనడానికి వెళ్తుండగా ఎదురుగా మహేంద్ర సుమో వాహనం వచ్చి వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని గమనించి చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా భగత్ మార్గమధ్యలో మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన కుమార్ తేజను ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



మునుగోడులో తొలిమెట్టు శిక్షణను పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి

చిట్యాల, మునుగోడు, నార్కట్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేసి వారిలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని డీఈఓ బి.భిక్షపతి అన్నారు. తొలిమెట్టు కార్యక్రమంపై చిట్యాలలోని జెడ్పీహెచ్‌ఎస్, మునుగోడు ఎమ్మార్సీ, నార్కట్‌పల్లిలో జరుగుతున్న ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్)శిక్షణను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. శిక్షణ పొందడం వల్ల ప్రతి ఉపాధ్యాయుడు.. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించేలా బోధించాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. చిట్యాలలో జరిగిన కార్యక్రమంలో ఎఫ్ఎల్ఎన్ కోర్సు ఇన్‌చార్జి డైరెక్టర్ గోగికార్ మాధవి, రిసోర్స్ పర్సన్స్ బొప్పని యాదయ్య, మర్యాద అశోక్‌రెడ్డి, ఐఈఆర్పీ బోయ శ్రీనివాస్, సీఆర్పీ జయకాంత్, జాన్, ప్రవళిక, వరలక్ష్మి, మునుగోడులో కోర్స్ డైరెక్టర్ టి.యాదయ్య, డీఆర్పీ తుల శ్రీనివాస్, ఎమ్మార్పీలు సయ్యద్ యూసుఫ్‌పాష, నాగేశ్వరావు, పారిజాత, రవికుమార్, దివ్య, నర్సింహ, సతీష్, నాగరాజు, పీఆర్‌సీలు సైదులు, నర్సింహ, సతీష్, నాగరాజు, నార్కట్‌పల్లిలో కోర్స్ డైరెక్టరు కాశయ్య, కోర్సు ఇన్‌చార్జి కవిత, ఆర్పీ కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, సీసీఓ బాజా మురళి, సీఆర్పీ నాగమణి, ఎంఈఎస్ ఆస్మా తదితరులు పాల్గొన్నారు.

‘సీతా కల్యాణ వైభోగమే’ సినిమా షూటింగ్



సన్నివేశంలో పాల్గొన్న శివాజీరాజా

భూదాన్‌పోచంపల్లి : డ్రీమ్ గేట్ ప్రొడక్షన్ పతాకంపై నిర్మిస్తున్న ‘సీతా కల్యాణ వైభోగమే’ సినిమా షూటింగ్ గురువారం మండలంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో జరిగింది. కాగా ఉపాధ్యాయుడి పాత్రలో నటిస్తున్న సీనియర్ నటుడు శివాజీరాజా, హీరో సుమన్ ఉట్కూరిపై పిల్లలకు విద్యాబోధన చేస్తున్న పలు టాకీపార్ట్ సన్నివేశాలను దర్శకుడు సతీష్ చిత్రీకరించారు. ఈ సందర్భంగా దర్శకుడు సతీష్ మాట్లాడుతూ.. సినిమా షూటింగ్ 80శాతం పూర్తయ్యిందని తెలిపారు. నేడు ప్రతి కుటుంబంలో, నిత్య జీవితంలో జరిగే ఘటనల ఆధారంగా కుటుంబ కథాంశంతో సినిమాను నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ సినిమాను పలు భాషల్లో దసరాకు విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికల్లో వాటా దక్కే వరకు పోరాటం



మోత్కూరు : సమావేశంలో మాట్లాడుతున్న స్వామి

మోత్కూరు / ఆత్మకూరు (ఎం) : జనాభా ప్రాతిపదికన పద్మశాలీలకు వచ్చే ఎన్నికల్లో వాటా దక్కే వరకు పోరాటం ఆగదని అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి అన్నారు. పద్మశాలీల రాజకీయ చైతన్యయాత్ర గురువారం మోత్కూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించి కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్ఎం ఫంక్షన్ హాల్‌లో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు మహేశ్వరం వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు పోచం భిక్షపతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 నియోజకవర్గాల్లో రాజకీయ చైతన్య యాత్ర కొనసాగుతుందని, సెప్టెంబర్ 3వ రోజు సరూర్‌నగర్ స్టేడియంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పద్మశాలి శంఖారావం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్‌రావు, మహిళా విభాగం అధ్యక్షురాలు వనం దుష్యంతుల, సంఘం మహిళా అధ్యక్షురాలు గుంటక రూప, జిల్లా అధ్యక్షుడు చెక్క వెంకటేశ్వర్లు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోచం కన్నయ్య, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ గుండు ప్రసాద్, కార్య నిర్వాహక అధ్యక్షుడు నల్ల యాదగిరి, పట్టణ ప్రధాన కార్యదర్శి జిల్లా రవీందర్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలోనూ కందగట్ల స్వామి మాట్లాడారు. రాజకీయ వాటా కోసం పద్మశాలీలు ఐక్యతతో పోరాడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకరరావు, రాజకీయ విభాగం అధ్యక్షుడు బొల్ల శివశంకర్, రాష్ట్ర నాయకులు ఏలూరి కృష్ణ, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు జల్ది రాములు, సంఘం మండల అధ్యక్షుడు ఎలగందుల మహేష్, ప్రధాన కార్యదర్శి గాడిపెల్లి ఉదయ్‌కుమార్, పురుషోత్తం పాల్గొన్నారు.

రాజాపేట : రాజ్యాధికారం కోసం పద్మశాలీలు ఏకం కావాలని తెలంగాణ ప్రాంత రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్ అన్నారు. పద్మశాలీల రాజకీయ రథయాత్ర మండలంలోని రఘునాథపురం చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన పద్మశాలీలకు అధిక సీట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జాతీయ మహిళా అధ్యక్షురాలు వనం దుశ్యంతల, సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, జిల్లా నాయకులు రామచందర్, శివశంకర్, శ్రీనివాస్, రూప, ప్రవళిక, సుజాత పాల్గొన్నారు.

ఆలేరులో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అయిలయ్య



బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట : రాబోయే ఎన్నికల్లో అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంతో పాటు ఆలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య అన్నారు. గురువారం పట్టణంలో ఆత్మకూరు (ఎం) మండలంలోని మొదుగుకుంటకు చెందిన బీఆర్ఎస్ సర్పంచ్ మామిడి లలిత మోహన్‌రెడ్డితో పాటు మోరిపిరాల, మొదుగుంట, చిన్నగూడెం గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు సుమారు 300మంది బీర్ల అయిలయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేసే దిశగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి జరుగుతుందని, తాను నాయకుడిని కాదు సేవకుడినని అన్నారు. కాంగ్రెస్ పార్టీలోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని తెలిపారు. నూతనంగా పార్టీలో చేరిన సర్పంచ్ లలితా మోహన్‌రెడ్డి, పలువురు నాయకులు మాట్లాడారు. నియోజకవర్గంలో బీర్ల అయిలయ్య చేస్తున్న సేవ కార్యక్రమాలు చూసి కాంగ్రెస్ పార్టీలో చేరామన్నారు. కార్యక్రమంలో గుట్ట, ఆత్మకూరు ఎంపీపీలు చీర శ్రీశైలం, తండ మంగమ్మశ్రీశైలం, ఆత్మకూరు మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, జెడ్పీటీసీ నరేందర్‌గుప్తా, వైస్ ఎంపీపీ పద్మ పాపయ్యగౌడ్, సర్పంచ్ జేన్నాయికోడె నగేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దులు, ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, నాయకులు బత్తిని ఉప్పలయ్య గౌడ్, హనుమంతు, ఆత్మకూరు టౌన్ అధ్యక్షుడు మల్లేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు చిత్తర్ల అనిల్, కిరణ్, సుభాష్, మహేష్, భరత్, నవీన్, హర్ష, అభి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, మూలవిరాట్‌స్వామికి పంచామృతాభిషేకం చేశారు. అదేవిధంగా స్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. నూతన పట్టువస్త్రాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుఫర్కపూజ, మాంగళ్యధారణ నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై దేశవ్యాప్త ఉద్యమం

- జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య

యాదగిరిగుట్ట : రవాణా రంగంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపైన దేశవ్యాప్త ఉద్యమం చేపట్టనున్నట్లు ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య తెలిపారు. యాదగిరిగుట్టలోని మున్నూరు కాపు సంఘం భవనంలో జరుగుతున్న ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్–సీఐటీయూ రాష్ట్ర కమిటీ సమావేశాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మోటార్ వాహన చట్టం -2019 కార్మికులకు తీవ్ర నష్టం చేసేవిధంగా ఉందన్నారు. అధిక పెనాల్టీ వేస్తూ రవాణా రంగం నుంచి ఒక్కొక్కరు తప్పుకునే విధంగా చేస్తుందని విమర్శించారు. నూతన మోటారు వాహన చట్టాన్ని రద్దు చేయాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వచ్చే అక్టోబర్ 6న అన్ని రాష్ట్రాల రాజధానుల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. టోల్ గేట్, ఫాస్టాగ్ వ్యవస్థలు పెద్ద స్కాం అని ఆరోపించారు. చట్టాన్ని వ్యతిరేకిస్తూ పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. తెలంగాణలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంపై విధివిధానాలు ప్రకటించిన తర్వాత స్పందిస్తామన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లేషం మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన తెలంగాణ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. యాదాద్రి కొండపైకి ఆటోలకు అనుమతి ఇవ్వాలని గత 486 రోజులుగా పోరాటం చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని విమర్శించారు. 300 కుటుంబాలకు ప్రత్యామ్నాయం చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎండీ పాషా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, కోటయ్య, రాంబాబు, రాష్ట్ర కార్యదర్శులు సాయిలు, పున్నం రవి, సీహెచ్ రవికుమార్, విజేందర్, నాయకులు కుమాస్వామి, గోవర్ధన్, రాజమౌళి, నాగరాజు, శ్రీనివాస్, ఉమర్, గణేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌తో రైతుల వాగ్వాదం

యాదగిరిగుట్ట రూరల్ : డిప్యూటీ తహసీల్దార్‌తో పలువురు రైతులు వాగ్వాదానికి దిగిన సంఘటన యాదగిరిగుట్ట రెవెన్యూ కార్యాలయంలో గురువారం చోటు చేసుకుంది. డీటీ నర్సింగరావు తెలిపిన వివరాల మేరకు.. బస్వాపురం రిజర్వాయర్‌లో ముంపుకు గురవుతున్న లప్పానాయక్ తండా గ్రామానికి పునరావాసం కల్పించాలని ప్రభుత్వం దాతర్‌పల్లి గ్రామంలో 30.11ఎకరాల భూమిని సేకరించింది. ఇందులో 17ఎకరాలు అసైన్డ్ భూమి ఉండగా అది 9మంది రైతుల వద్ద ఉంది. ఆ స్థలాన్ని ప్రభుత్వం తీసుకుని సదరు రైతులకు కొంత నగదు ఇచ్చింది. ఇందులో బాలమల్లయ్య అనే ఓ రైతుకు నగదు ఇవ్వొద్దని ఆ భూమి మాకు వర్తిస్తుందని, అతడి కుటుంబ సభ్యులు గతంలో అభ్యంతరం తెలపడంతో ఆ రైతుకు నగదును ఇవ్వకుండా ప్రభుత్వం నిలిపివేశారు. అనంతరం విచారణ చేసి బా ల మల్లయ్యకే ఆ భూమి నగదు చెల్లించాలని నిర్ణయించి పైఅధికారులకు రిపోర్టు పంపించారు. కాగా తప్పుడు రిపోర్టును పంపించారని సదరు కుటుంబ సభ్యులు గురువారం ఉదయం కార్యాలయానికి వచ్చి డీటీ నర్సింగరావుతో అసభ్య పదజాలంతో వాగ్వాదానికి దిగారు. తాము నిజాయితీగా రిపోర్టును పంపించామని డీటీ తెలిపారు. అయినా వారు గొడవ ఆపకపోవడంతో చేసేది లేక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయండి అని ఆ రైతులకు నచ్చజెప్పి అక్కడ నుంచి పంపించి వేశారు.